1-4-99

## ప్రధానం

# 'విజన్'కు ప్రత్యామ్నాయం లేదా?



బాలగోపాల్

విజన్ 2020" కి ప్రత్యామ్నాయం కావాలనడంలో సందేహం లేదు. అది మన రాష్ట్రంలోని సామాన్య ప్రజలకు చాలా నష్టకరం అనడంలో సందేహమసలే లేదు. కాబట్టి ప్రస్తుత పరిస్థితులలో ఆచరించగల ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాన్ని ప్రజలలో చర్చకు పెట్టడం అవసరం.

'ప్రస్తుత పరిస్థితులలో' అనడానికి ఒక కారణం ఉంది. ఒకటేమిటి మూడున్నాయి. సోషలిస్టు ఆర్థిక విధానాన్ని 'విజన్' కు ప్రత్యామ్నాయంగా ప్రతిపాదించవచ్చు. కానీ చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ గానీ, రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కానీ ఆ సూచనను స్వీకరిస్తాయని నమ్మడానికి ఆస్కారమేమీలేదు. కాబట్టి వాళ్ళు ఆచరించగల ప్రత్యామ్నాయాన్ని ప్రజలలో చర్చకు పెట్టడం ఫలితాన్ని ఇవ్వగల కృషి. ఇది ఒక కారణం. రెండవ కారణమేమిటంటే సోషలిజం (మనుషులందరూ శ్రమనూ, సంపదనూ సమిష్టిగా పంచుకునే జీవనవిధానం) ప్రస్తుత జీవనవిధానాలకంటే గొప్పది అనడంలో సందేహం లేదు. దాని సాధనకోసం కృషి చేయడం ఒక ముఖ్యమైన రాజకీయ కృషి అనడంలోనూ సందేహం లేదు. కానీ దాని స్వరూపం ఏ విధంగా ఉంటుందో, అది ఏ విధంగా సాధ్యమవుతుందో ఇప్పుడెవ్వరికీ తెలీదు. ఈ శతాబ్దపు కమ్యూనిస్టు ప్రయోగాల చరిత్ర అనేక విషయాలలో జ్ఞానంతో పాటు ఈ అజ్ఞానాన్ని కూడా మిగిల్చింది. అందువల్ల కూడా పెట్టుబడిదారీ మార్కెట్ ఆర్థిక వ్యవస్థ పరిధిలోనే "విజన్ –2020" కు ప్రత్యామ్నాయం ఉంటే వెతికి ప్రజలలో చర్చకు పెట్టడం అవసరం. ఏ మేరకైతే అది పెట్టుబడిదారీ వ్యవస్థకు సహజమైన అసమానతలనూ, హింసనూ తగ్గిస్తుందో ఆ మేరకు సోషలిజం సాధనకోసం జరిగే కృషికి కూడా తోడ్పడుతుంది. మూడవ కారణమేమిటంటే ఏ పెట్టుబడిదారీ మార్కెట్ వ్యవస్థకయితే "విజన్ –2020" నిర్విచక్షణగా పెద్ద పీట వేస్తుందో, ఆ వ్యవస్థను ప్రజలందరూ ద్వేషించడంలేదు. అది ప్రజలలో అధిక భాగానికి నష్టకరమైనదనీ స్వాభావితంగా అమానుషమయినదనీ చెప్పవలసిన అవసరం ఇంకా చాలా ఉంది. దానిలోని ఆకర్షణను సవాలు చేయవలసిన అవసరమూ ఉంది. 'ప్రస్తుత పరిస్థితులలో' అన్నప్పుడు ఈ కర్తవ్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవలసి ఉంటుంది.

"విజన్ –2020" లో ఒక తర్కం ఉంది. అది చాలా సహజమైనదిగానూ చాలా హేతుబద్ధమైనదిగానూ చూపించబడింది. కానీ అది సహజమూ కాదు, హేతుబద్ధమూ కాదు. అది ఒక దృక్కోణం నుండి పుట్టిన తర్కం. కొన్ని పరిమితమైన ప్రయోజనాలు సాధించే తర్కం. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం అంటే రాష్ట్ర స్థూలఉత్పత్తిలో వేగవంతమైన పెరుగుదల సాధించడమేనని "విజన్" భావిస్తుంది. ప్రస్తుతం ఇంకా అయిదు శాతం అందుకోని పెరుగుదల రేటును పది శాతానికి (రెండు దశాబ్దాల కాలంలో) తీసుకుని పోవాలనీ, అదే నిజమైన అభివృద్ధి అనీ నమ్ముతుంది. మనల్ని నమ్మమంటుంది. ఈ అభివృద్ధికి చాలా పెట్టుబడి కావాలి. (30 లక్షల కోట్ల రూపాయలని "విజన్ 2020" అంచనా) కాబట్టి బయటి రాష్ట్రాల నుండి విదేశాల నుండి కూడా (ప్రైవేట్ పెట్టుబడిదార్ల నుండేకాక ప్రపంచ బ్యాంకు నుండి కూడా) పెట్టుబడి భారీగా తెచ్చుకోక తప్పదని "విజన్" భావిస్తుంది. అభివృద్ధిని ఈ విధంగా కాక మరొక విధంగా నిర్వచించుకుంటే అందుకు కావలసిన పెట్టుబడి వనరులు చాలా వరకూ మన రాష్ట్రంలోనే సేకరించవచ్చుననీ, ధనవంతుల ఆదాయాలను ముట్టుకోవడానికి ప్రభుత్వం వెనుకాడకపోతే అందులో కష్టమేమీలేదని భావించడానికి చోటేలేదని 'విజన్' మనల్ని నమ్మమంటుంది. మరి పెద్దఎత్తున పెట్టుబడి వనరులు తెచ్చుకోవాలంటే ఆ పెట్టుబడికి అనుబంధంగా వచ్చే సాంకేతిక ప్రక్రియలతోనో, అవి కల్పించే ఒత్తిళ్ళతోనో మనం అడ్జెస్ట్ కాక తప్పదని, ఆ పెట్టుబడికి అవసరమైన నిర్మాణాలన్నీ చవగ్గా, ఆకర్షణీయంగా కల్పించకతప్పదనీ, దానికోసం అయ్యే ఖర్చంతా పెట్టుకోవాలనీ, లేకపోతే ఆ పెట్టుబడి వేరే రాష్ట్రాలకూ, దేశాలకూ వెళ్ళిపోతుందని కూడా "విజన్" మనల్ని ఒప్పించాలనీ చూస్తుంది. ఆ పెట్టుబడి ఏ రంగంలో ప్రవేశించాలని ఇష్టపడితే ఆ రంగంలోకి రానివ్వకతప్పదని (అది గొర్రెల పెంపకం కావచ్చు. కోళ్ళ ఫారాలు కావచ్చు. చేపల వేట కావచ్చు. పూలూ, పండ్ల ఎగుమతి కావచ్చు). ఆ రంగంలో బతికే సామాన్య ప్రజలు ఏమైపోతారని బాధపడడం వెనుకబాటుతనమని కూడా 'విజన్' మనల్ని నమ్మమంటుంది. ఆ పెట్టుబడికోసం మనబోటి ఇతర రాష్ట్రాలూ, దేశాలూ అనేకం పోటీపడుతున్నాయి. కాబట్టి అది కార్మిక చట్టాలను సడలించమంటే సడలించాలనీ, భూగరిష్ఠపరిమితిని సవరించమంటే సవరించాలనీ, ప్రభుత్వ అజమాయిషీ తొలగించమంటే తొలగించాలనీ, చేతి వృత్తులకూ సన్నకారు చిన్నకారు సంస్థలకూ రిజర్వేషన్లు ఉండకూడదంటే తీసేయాలనీ లేకపోతే ఘోరంగా నష్టపోతామనీ నమ్మమంటుంది. ఈ పెట్టుబడికి వేగంగా అభివృద్ధి సాధించడంలో చాలా యోగ్యత ఉంది కాబట్టి ఆర్థిక రంగాన్ని దానికి వదిలిపెట్టి, లేనిపోని నియంత్రణ చేయకుండా కేవలం పెట్టుబడికి కావలసిన నిర్మాణ సంబంధమైన సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం పరిమితం కావడమే హేతుబద్ధమైన విధానమని కూడా మనల్ని 'విజన్' నమ్మమంటుంది.

ఈ విధానంవల్ల ఎవరికీ ఏ ప్రయోజనమూ ఉండదని చెప్పలేము. తగు మాత్రం ఆస్తి ఉంటే దీనిని ఉపయోగించుకుని చాలా ప్రయోజనం పొందవచ్చు. మధ్యస్థంగా ఉండే వాళ్ళు కూడా ఆశపడి ప్రయోజనం పొందే ప్రయత్నం చేసే అవకాశం ఉంది. అది ఫలితాన్ని ఇవ్వగలదు కానీ వారి జీవితాలను అస్థిరతలో పడేస్తుంది. వనరులు, సాంఘిక అవకాశాలు లేని వారికి మాత్రం ఈ 'విజన్' లో ఏమీ లేకపోగా అది వారికి చాలా నష్టం చేయగలదు.

ప్రత్యామ్నాయ ఆలోచన, పెట్టుబడిని పెద్ద ఎత్తున తీసుకోవాలి అన్న ప్రశ్న దగ్గర మొదలు పెట్టకుండా ఈ ప్రజలకు ఉపాధి ఏ విధంగా కల్పించాలి అన్న ప్రశ్న దగ్గర మొదలుపెట్టి విధాన రచన చేయాలన్న సూచనతో ప్రారంభం కావాలి. పెట్టుబడిదారీ మార్కెట్ వ్యవస్థ పరిధిలోనే ఈ ప్రత్యామ్నాయతర్కాన్ని ప్రవేశపెట్టి ప్రపంచ ఆర్థిక విధాతలను కుదిపివేసిన వాడు అమర్త్యసేన్. ఆయనను తాము చాలా గౌరవిస్తున్నామని చంద్రబాబు నాయుడుతో సహా మన దేశ పాలకులందరూ అంటున్నారు కాబట్టి ఆయన ఆలోచనా రీతిని వాళ్ళు అమలు చేసినా చేయకున్నా దానికి జవాబు చెప్పక తప్పదు.

ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ నియంత్రణ ఎంత, పెట్టుబడికి స్వేచ్ఛ ఎంత, సహకార ఉత్పత్తి ఎంత, వ్యక్తి వ్యాపారం ఎంత అనేవి ముఖ్యమైన ప్రశ్నలుకావని, ఆర్థిక ప్రక్రియలో పాల్గొని ప్రయోజనం పొందడానికి కావలసిన బలం లేక సామర్థ్యం, ప్రజలకు ఏ మేరకు ఉందనే ప్రశ్నే ముఖ్యమని సేన్ అంటాడు. ఈ ఆలోచనా రీతిలో ఉన్న సమస్యలను ఇప్పుడు చర్చించడం అనవసరం. అది ప్రతిపాదించే విధానతర్కాన్ని 'విజన్' కు ప్రత్యామ్నాయంగా వివరించడం అవసరం.

భూమివంటి వనరులపైన హక్కు, విద్యావకాశాలు, ఆరోగ్యం, సమాన సాంఘిక అవకాశాలు, మార్కెట్ వ్యవస్థలో పాల్గొనే ఆర్థిక స్వేచ్ఛ, 'ప్రభుత్వపాలనలోనూ విధాననిర్ణయాలలోనూ భాగస్వామ్యం, రాజకీయ ప్రజాస్వామ్యం, ప్రజలకు బలాన్నీ సామర్థ్యాన్నీ కల్పించే విషయాలుగా అమర్త్యసేన్ గుర్తిస్తాడు. ఇవి ప్రజలకు కల్పించడం ప్రధానమనీ ప్రభుత్వ విధానరచన దీనిని ముఖ్యలక్ష్యంగా తీసుకోవాలనీ అంటాడు. పెట్టుబడి దిగుమతి, పెట్టుబడికి ఇచ్చే సదుపాయాలు మొదలయినవి ఆ తర్వాత వస్తాయి. ఈ రెండు అవసరాల మధ్య వైరుధ్యం ఏర్పడితే మొదటి అవసరమే గెలవాలి. ఎందుకంటే 'ప్రజల సామర్థ్యం తగిన రీతిలో పెరిగినప్పుడే వారు సరళీకరణవల్ల, ప్రపంచీకరణవల్ల వచ్చే కొత్త పరిస్థితిలో లాభదాయకంగా పాల్గొన గలుగుతారు. లేకపోతే అందులో పాల్గొనలేకపోగా లాభం పొందలేకపోగా చాలా తీవ్రంగా దెబ్బతింటారు.

బ్రెజిల్‌ను అమర్త్యసేన్ ఈ సందర్భంగా ఒక ఉదాహరణగా చెప్తాడు. ప్రజల బలాన్నీ, సామర్థ్యాన్నీ పెంచే ప్రయత్నమేదీ చేయకుండా ప్రభుత్వం దేశ ఆర్థిక విధానాలను సరళీకరణ, ప్రపంచీకరణ బాటలపైననే పెడితే ఒకవైపు స్థూల జాతీయ ఉత్పత్తి పెరుగుదల రేటు మెరుగవుతూ కూడా ఇంకొక వైపు పేదరికం పెరగగలదు. నిరుద్యోగం పెరగగలదు. అసమానతలు పెరగగలవు. హింస పెరగగలదు అని చెప్తూ బ్రెజిల్‌ను ఆయన ఒక ఉదాహరణగా చూపిస్తాడు.

చంద్రబాబు నాయుడు 'విజన్' ప్రజల బలాన్నీ, సామర్థ్యాన్నీ పెంచేది కాదు. వాటిని ఘోరంగా దెబ్బతీస్తుంది. భూమి, పచ్చికబయళ్ళు, బీళ్ళు, జలవనరులు, అటవీ సంపద, ప్రజలకు బలాన్నీ ఇచ్చే వనరులుగా కాక పెట్టుబడికి భోజ్యమైన వ్యాపార విషయాలుగా 'విజన్' కు కనిపిస్తాయి. గొర్రెల కాపరులు తమ మందలను మేపుకునే పచ్చిక బయళ్ళను కార్పొరేట్ గొర్రెల పెంపకం కేంద్రాలకు లీజుకు ఇవ్వాలని 'విజన్' ప్రతిపాదిస్తుంది. పేదలు, దళితులు కోరుకునే పోరంబోకు భూములను పళ్ళ తోటల కంపెనీలకు, కోళ్ళ దాణాకోసం మొక్కజొన్న పండించుకోవడానికి కోళ్ళపెంపకం కంపెనీలకూ ఇవ్వాలని ప్రతిపాదిస్తుంది. ఆదివాసీ ప్రాంతాలలో ఖనిజాన్వేషణ ఇష్టమొచ్చినట్టు సాగనిస్తే ఆదివాసీలు జీవనం కోల్పోతారన్న సందేహంతో దానికి పరిమితులు పెట్టిన ప్రస్తుత విధానాలను సవరించి ప్రైవేట్ మైనింగ్‌కు అడవులలో అవకాశం ఇవ్వాలని ప్రతిపాదిస్తుంది. పోనీ ప్రకృతి వనరులను కార్పొరేట్ పెట్టుబడిపరం చేసే ఈ 'విజన్' పేదలకు అందుకు ప్రత్యామ్నాయంగా నిత్యం పనికల్పించే ఆర్థిక విధానాలను ప్రతిపాదిస్తుందా అంటే అదేం లేదు. భారీగా రాష్ట్రంలోకి పెట్టుబడి రావాలన్నా అభివృద్ధి 'విజన్' నమూనాలో జరగాలన్నా రోడ్లు, రైల్వే లైన్లు, ఓడరేవులు, విద్యుత్ ప్రాజెక్టులు తదితర నిర్మాణపరమైన కార్యక్రమాలు చాలా చేపట్టవలసి ఉంటుందనీ, ఆ కార్యక్రమాలు భూమిలేని ఇతర వనరులు లేని ప్రజలకు పని కల్పిస్తాయనీ 'విజన్' అంటుంది. దీనితో ప్రజలు పొందే బలం లేక సామర్థ్యం చాలా స్వల్పం.

పోనీ విద్యా, ఆరోగ్య విషయాలలో 'విజన్' ప్రతిపాదనలేమైనా మెరుగ్గా ఉన్నాయా అంటే ప్రాథమిక విద్య వైద్య రంగాలలో ప్రభుత్వ బాధ్యత గణనీయంగా ఉందని అంటూనే ఆపైన మాత్రం ఆ రెండు రంగాలూ కేవలం ప్రైవేట్ పరం కావడమే కాదు, ప్రైవేట్ వ్యాపార రంగంలో కీలకమైన చోదక పాత్ర నిర్వహిస్తాయని 'విజన్' అంటుంది.

అంటే రాబోయే రెండు దశాబ్దాల కాలంలో మన రాష్ట్ర ఆర్థికరంగం పది శాతం పెరుగుదల రేటు అందుకోవడంలో విద్య, వైద్య, వ్యాపారాలు ప్రధాన చోదక పాత్ర నిర్వహిస్తాయి. ఇంక అవి సామాన్య ప్రజలకు ఏ మాత్రం అందుబాటులో ఉంటాయో సరళీకృత ఆర్థిక రంగంలో పాల్గొనడానికి కావలసిన బలం ఏ మాత్రం ఇస్తాయో ఊహించుకోవచ్చు.

సాంఘిక అవకాశాలలో సమానత్వం గురించి 'విజన్' లో సాధారణ హామీలున్నాయిగానీ నిర్దిష్టమైన విధాన ప్రతిపాదన లేవీ లేవు. కులం, పురుషాధిక్యత సాంఘిక అవకాశాలలో అసమానతకు ముఖ్య మూలాలు. వాటిని అంతం చేయడానికి కాకపోతే కనీసం బలహీనపరచడానికి కావలసిన ఒక్క ప్రతిపాదన సహితం 'విజన్' లో లేదు.

సారాంశంలో, అమర్త్యసేన్ ప్రతిపాదించే గీటురాయి ప్రకారం –'విజన్–2020' ప్రజలను బలహీనులను చేసి సరళీకరణలోకీ, ప్రపంచీకరణలోకీ నెడుతుంది. వాళ్ళ చేతిలో భౌతిక వనరులు లేకుండా చేసి విద్య, వైద్య సదుపాయాలు అందుబాటులో లేకుండా చేసి సాంఘిక అసమానతలను ఎదుర్కోవడానికి చేయూత లేకుండా చేసి కార్పొరేట్ పెట్టుబడి రూపొందించే ఆర్థిక వ్యవస్థలో వారిని పారేసి బతకమంటుంది.

దీనికి ప్రత్యామ్నాయం –ప్రస్తుత పరిస్థితులలో –ఈ విమర్శ నుండే రావాలి. 'భారత రత్న' బిరుదిచ్చి గౌరవించిన ఆ నోబెల్ బహుమతి గ్రహీత ప్రతిపాదించిన తర్కం ప్రకారం ప్రజల బలాన్నీ సామర్థ్యాన్నీ పెంచే నిర్దిష్టమైన సాంఘిక ఆర్థిక విధానాలు ప్రభుత్వానికి ఉండాలి. వాటికి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి. రాష్ట్ర ఆర్థిక విధానాల రూపకల్పనకు ఇది ప్రాతిపదిక కావాలి.

> **'విజన్–2020'లో ఒక తర్కం ఉంది. అది చాలా సహజమైనదనీ, హేతుబద్ధమైనదనీ చూపించారు. కానీ అది సహజమూ కాదు, హేతుబద్ధమూ కాదు. అది ఒక దృక్కోణం నుంచి పుట్టిన తర్కం. కొన్ని పరిమితమైన ప్రయోజనాలు సాధించే తర్కం. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం అంటే రాష్ట్రస్థూలఉత్పత్తిలో వేగవంతమైన పెరుగుదల సాధించడమేనని 'విజన్' భావిస్తుంది. ప్రస్తుతం ఇంకా అయిదుశాతం కూడా అందుకోని పెరుగుదల రేటును పది శాతానికి (రెండుదశాబ్దాల కాలంలో)తీసుకునిపోవాలనీ, అదే నిజమైన అభివృద్ధిఅనీ నమ్ముతుంది.**